RNI. No. APTEL/2011/41055




# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక




సంపుటి : 12 సంచిక : 326 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | బుధవారం, 29 మే 2024 | పేజీలు : 4 | వెల : 2/-

# మేడిగడ్డపై ఆనాడే చెప్పా!




## ప్రాజెక్టు వెన్నెముక ఇరిగిందని ముందే చెప్పాను: సీఎం రేవంత్ రెడ్డి

న్యూఢిల్లీ: తెలంగాణలో రాచరిక వ్యవస్థకు తావులేదని, తెలంగాణ అంటే త్యాగాలు, పోరాటాలని, తెలంగాణ పోరాటాలు, చిహ్నాలు, తెలంగాణ తల్లి, గీతం స్ఫురించేలా తెలంగాణ చిహ్నం ఉంటుందని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు.

తెలంగాణ రాష్ట్ర గీతం రూపకల్పన బాధ్యతలు అందె శ్రీకి ఇచ్చామని, అందె శ్రీ ఎవరిని ఎంచుకుని గేయ రూపకల్పన చేస్తారనేది ఆయన ఇష్టమన్నారు. ఏ సంగీత దర్శకుడిని పెట్టి గేయ రూపకల్పన చేయాలనేది తనపనికాదన్నారు. రాష్ట్ర గేయ రూపకల్పన బాధ్యత అంతా అందె శ్రీ దేనని, తెలంగాణ చిహ్న రూపకల్పన నిజామాబాద్ వ్యక్తికి ఇచ్చామని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న ఆయన మంగళవారం మీడియాతో చిట్ చాట్‌గా మాట్లాడారు. మేడిగడ్డ ప్రాజెక్టు వెన్నెముక ఇరిగిందని తాను ముందే చెప్పానని, గత ప్రభుత్వం నీళ్లను సముద్రంలోకి విడిచిందని, సముద్రంలో పోసిన నీళ్లకు కరెంట్ బిల్లు కట్టమని చెప్పారు. ఎన్నికల కోడ్ రాష్ట్రంలో ఉన్నందున ఫోన్ టాపింగ్‌పై సమీక్ష జరపలేదన్నారు.

ఫోన్ టాపింగ్ అంశం అధికారులు చూసుకుంటున్నారని, దానితో తనకు ఎలాంటి సంబంధం లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. హార్డ్ డిస్కులను ధ్వంసం చేశారని, అన్నింటిపై సీబీఐ విచారణ అడిగే కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావులు ఫోన్ టాపింగ్‌పై సీబీఐ విచారణ ఎందుకు కోరడం లేదని సీఎం రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. తాను ఫోన్ ట్యాపింగ్ చేయించడం లేదని, అలాంటి పనులు చేయనని స్పష్టం చేశారు. బ్యాకప్ డేటాకు సంబంధించిన హార్డ్ డిస్కులు ఫామ్ హౌస్‌లో ఉన్నాయో.. ఇంకా ఎక్కడ ఉన్నాయో విచారణ అధికారులు తేల్చాలని ముఖ్యమంత్రి అన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సమస్య, కోతలు లేవని, కొన్ని చోట్ల వర్షాల కారణంగా సదుపాయాలలో అవంతరాలు ఉన్నాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పక్క రాష్ట్రంలో పోలీసు అధికారులందరినీ కూడా ఎన్నికల సమయంలో ట్రాన్స్‌ఫర్ చేశారని, తెలంగాణలో ఎలాంటి ట్రాన్స్‌ఫర్‌లు లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయన్నారు. ఎన్నికల సమయంలో ప్రతిపక్షాలు ఎలాంటి ఆరోపణలు చేయకుండా ఎన్నికలు జరిగాయని, స్వేచ్ఛాయుత వాతావరణంలో రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించామన్నారు. ఎక్కడ కూడా అధికార దుర్వినియోగం చేశామని ప్రతిపక్షాలు సైతం ఆరోపణలు చేయలేదన్నారు. కాగా ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణ అవతరణ దినోత్సవం కార్యక్రమానికి హాజరుకావాలని కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీకి ఆహ్వానం పంపించారు.




## ఎన్టీఆర్‌కు కేంద్రం భారతరత్న ఇవ్వాలి: ఎర్రబెల్లి

హైదరాబాద్: తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకుడు, మాజీ ముఖ్యమంత్రి, నందమూరి తారక రామారావు 101వ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకరరావు ఎన్టీఆర్ ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. స్వర్గీయ ఎన్టీఆర్‌కు కేంద్రం భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్టీఆర్ తనకు దైవ సమానులని.. తనకు రాజకీయ జీవితాన్ని ప్రసాదించారని చెప్పారు. తాను మొదట నుంచి కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకినని, 25 ఏళ్ళ వయస్సుకే తనకు ఎన్టీఆర్ వరంగల్ జిల్లా పార్టీ పదవి ఇచ్చారని ఎర్రబెల్లి తెలిపారు. ఆయన ఆశీర్వాదంతో 26 ఏళ్ళకే ఎమ్మెల్యేగా పోటీ చేశానని చెప్పారు. ఎన్టీఆర్ తెలుగువారికి గర్వకారణమన్నారు. పెన్షన్లు, కిలో రెండు రూపాయల బియ్యం పరిచయం చేసిందే ఎన్టీఆర్ అని కొనియాడారు. ఎన్టీఆర్ స్ఫూర్తితోనే ప్రస్తుత ప్రభుత్వాలు పనిచేస్తున్నాయని ఎర్రబెల్లి దయాకరరావు పేర్కొన్నారు.

# ఆ రెండు సీట్లపైనే ఉత్కంఠ

## ఎవరు గెలిచినా తక్కువ మెజార్టీతోనే..





తెలంగాణలో 17 లోక్‌సభ స్థానాలకు ఎన్నికలు జరిగాయి. ఫలితాల కోసం ప్రజలంతా ఎదురుచూస్తున్నారు. ఓటర్ల తీర్పు ఎలా ఉండబోతుందనే ఉత్కంఠ రాజకీయపార్టీల్లో కొనసాగుతోంది. హైదరాబాద్ లోక్‌సభ స్థానం మినహిస్తే మిగిలిన 16 నియోజకవర్గాల్లో గెలుపుపై కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ ధీమాగా ఉన్నాయి. ఈ 16 నియోజకవర్గాల్లో రెండు నియోజకవర్గాలు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నాయి. ఈ రెండు చోట్ల పోరు హోరాహోరీగా జరగడంతో ఎవరు గెలుస్తారనేది స్పష్టంగా చెప్పలేని పరిస్థితి నెలకొంది. సర్వే సంస్థలకు సైతం ఇక్కడి ఫలితం అంతుబట్టడంలేదట. అవే మహబూబ్‌నగర్, భువనగిరి. ఈ రెండు నియోజకవర్గాలు సీఎం రేవంత్ రెడ్డికి ప్రతిష్టాత్మకంగా మారాయి. మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం సీఎం సొంత జిల్లా కాగా.. భువనగిరి ఎంపీ అభ్యర్థి చామల కిరణ్ కుమార్ రెడ్డి రేవంత్‌కు దగ్గర వ్యక్తిగా ఉన్నారు.

దీంతో ఈ రెండు నియోజకవర్గాల్లో తప్పనిసరిగా గెలిచేందుకు హస్తం పార్టీ తీవ్రంగా ప్రయత్నించింది. బీజేపీ నుంచి బలమైన అభ్యర్థులు ఉండటంతో మహబూబ్‌నగర్, భువనగిరిలో బీజేపీ, కాంగ్రెస్ మధ్య నువ్వా.. నేనా అన్నట్లు పోటీ జరిగిందని.. ఎవరు గెలిచినా 10 నుంచి 20 వేల లోపు మెజార్టీతోనే గెలిచే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**మహబూబ్‌నగర్‌పై అందరి దృష్టి..** మహబూబ్‌నగర్ లోక్‌సభ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే వంశీ చందర్‌రెడ్డి, బీజేపీ అభ్యర్థిగా మాజీ మంత్రి డీకే అరుణ పోటీ చేశారు. డీకే అరుణకు జిల్లాపై మంచి పట్టుఉండటంతో పాటు.. ప్రజల్లో ఉండే మనిషిగా గుర్తింపు ఉంది. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మహబూబ్‌నగర్ ఎంపీగా పోటీచేసి రెండో స్థానంలో నిలిచారు. అవే ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన వంశీచందర్ రెడ్డి లక్షా 93 వేల 631 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. డీకే అరుణ 70వేలకు పైగా ఓట్ల తేడాతో బీఆర్ఎస్ అభ్యర్థి మన్నె శ్రీనివాసరెడ్డి చేతిలో ఓటమి చెందారు. డీకే అరుణకు, వంశీ చందర్‌రెడ్డి మధ్య దాదాపు లక్షా 40 వేల ఓట్ల తేడా ఉంది. ఈ ఎన్నికల్లో డీకే అరుణ, వంశీచందర్ రెడ్డి మధ్య రసవత్తరమైన పోరు జరిగింది. ఎన్నికల ప్రచారంలో ఒకరిపై ఒకరు మాటల యుద్ధం కొనసాగించారు. మరోవైపు సీఎం రేవంత్ రెడ్డి వంశీచందర్ రెడ్డి గెలుపుకోసం తీవ్రంగా కృషి చేశారు. దీంతో ఇక్కడ ఎవరు గెలుస్తారనేది ఆసక్తిగా మారింది. విజయంపై ఇద్దరు నేతలు ధీమాతో ఉన్నారు. డీకే అరుణ స్వల్ప మెజార్టీతో బయటపడే అవకాశం ఉందని కొందరు అంచనావేస్తే.. వంశీ చందర్‌రెడ్డి గెలిచే అవకాశం ఉందని మరికొందరు అంచనా వేస్తున్నారు.

**భువనగిరిపై ఆసక్తి..** భువనగిరి లోక్‌సభ స్థానంలో ఎవరు గెలుస్తారనేది ఆసక్తిరేపుతోంది. కాంగ్రెస్‌కు కంచుకోటగా.. కోమటిరెడ్డి బ్రదర్స్‌కు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న ఈ నియోజకవర్గంలో గెలుపు కాంగ్రెస్‌కు ప్రతిష్టాత్మకంగా మారింది. ఈ నియోజకవర్గంలో గ్రామీణ ప్రాంత ఓటర్లు అధికంగా ఉంటారు. దీంతో ఇక్కడ కాంగ్రెస్ ఈజీగా గెలుస్తుందని అంతా అంచనావేశారు.

కానీ బీజేపీ నుంచి మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌ను రంగంలోకి దింపడంతో ఆయన కాంగ్రెస్‌కు గట్టిపోటీ ఇచ్చినట్లు తెలుస్తోంది. మరోవైపు రేవంత్‌రెడ్డికి సన్నిహితుడిగా పేరొందిన చామల కిరణ్‌కుమార్ రెడ్డికి కాంగ్రెస్ టికెట్ ఇవ్వడంతో ఈ నియోజకవర్గంలో విజయం కోసం కొంచెం ఎక్కువుగా కష్టపడాల్సి వచ్చిందని ఆ పార్టీ నాయకులు కొందరు బహిరంగంగానే చెప్పుకుంటున్న పరిస్థితి నెలకొంది. భువనగిరిలో బీసీ సామాజికవర్గం ఓటర్లు ఎక్కువుగా ఉంటారు. బూర నర్సయ్యగౌడ్ బీసీ కావడంతో ఆ వర్గం ఓట్లు తమకు పడతాయని బీజేపీ ఆశిస్తోంది. బీసీ ఓట్లలో ఎక్కువశాతం తనకే పడతాయని.. గెలవడం సులువని బూర నర్సయ్యగౌడ్ కాన్ఫిడెంట్‌తో ఉన్నారు. గెలుపుపై కాంగ్రెస్ ధీమా వ్యక్తం చేస్తున్నప్పటికీ.. లోలోపల ఓటమి భయం వెంటాడుతోందనే ప్రచారం జరుగుతోంది. ఈ రెండు నియోజకవర్గాల్లో ఓటర్లు ఎవరికి అనుకూలంగా తీర్పు ఇచ్చారనేది జూన్4న తేలనుంది.





# అన్నదాతకు శుభవార్త

## 'కోడ్' ముగియగానే ఎకరానికి రూ. 15 వేలు

హైదరాబాద్ : రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.15వేలకు పెంచుతామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు హామీనిచ్చింది. ఆరు గ్యారంటీల్లో ఇది కూడా ఒకటి. ప్రస్తుతం రైతు బంధు కింద ఐదు ఎకరాల్లోపు రైతులకు ఎకరానికి రూ.10వేలు మాత్రమే ఇచ్చారు. మిగిలినవారికి లోక్ సభ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత జమ చేయనున్నారు.

వచ్చే వర్షాకాలం నుంచి రైతు భరోసా కింద ఎకరానికి రూ.15వేలు ఇవ్వనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. పంట వేసుకున్న రైతులకే వీటిని ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు.

**నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ :** రైతుల నుంచి కౌలు రైతులు అఫిడవిట్లు తీసుకోవాలని, అలా తీసుకున్న వారికే భరోసా నిధులు అందుతాయన్నారు. రైతు భరోసాపై అఖిలపక్షంతోపాటు రైతులు, రైతు సంఘాల అభిప్రాయాన్ని తీసుకోబోతున్నట్లు చెప్పారు. శాసనసభలో దీనిపై చర్చ జరుగుతుందన్నారు.

రూ.2 లక్షల రుణమాఫీని కచ్చితంగా అమలు చేయాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం ఉందని, గత ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీని కూడా సరిగా చేయలేదని మంత్రి తుమ్మల విమర్శించారు. నిధుల సమీకరణకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రైతులు తీసుకున్న రూ.2 లక్షల్లోపు పంట రుణాలపై వాస్తవ లెక్కలను ఇవ్వాలని ఇప్పటికే బ్యాంకులను ఆదేశించినట్లు తుమ్మల వెల్లడించారు.

**బీమా కంపెనీలకు కాదు.. రైతులకు మేలు జరిగేలా :** కోడ్ ముగిసిన తర్వాత కటాఫ్ తేదీపై మంత్రిమండలిలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తుమ్మల చెప్పారు.

ప్రకృతి వైపరీత్యాలతోపాటు అకాల వర్షాలు, వరదలవల్ల, కరవు వల్ల పంటలు నష్టపోయినవారిని ఆదుకునేలా పంటల బీమా పథకం ఉంటుందని, పంట వేయలేని పరిస్థితి ఉన్నా, దిగుబడులు తగ్గినా సాయం అందుతుందన్నారు. ఈ పథకానికి రూ.3500 కోట్ల మేర ఖర్చు చేయడానికి సిద్ధమయ్యామన్నారు. బీమా కంపెనీలకు కాకుండా రైతులకు మేలు జరిగేలా తమ ప్రభుత్వ విధివిధానాలు ఉంటాయని స్పష్టం చేశారు.


# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## ఇండియా కూటమికి మమత గండం!?

మమతా బెనర్జీ ఉండాల్సిన వారు అని అందుకే అంటారు. ఆమె ఉండే పక్షంలో విపక్షంగా ఉంటారు. అలాగని తాను దూరంగానూ ఉండరు దగ్గరగానూ ఉండరు. జాతీయ స్థాయిలో మోడీ అమిత్ షాలను ఢీ కొట్టి ఇండియా కూటమి ఈసారి బాగానే రాజకీయ ప్రదర్శన చేసింది అన్న విశ్లేషణలు ఉన్నాయి. రాహుల్ గాంధీ లాంటి వారు ఆరితేరిపోయిన తీరులో స్పీచ్ లను ఇచ్చారు. మల్లికార్జున ఖర్గే లాంటి వారి ఇంటర్వ్యూలు భలే ఆకట్టుకుంటున్నాయి. ములాయం సింగ్ రాజకీయ చతురతను పూనిన తీరులో అఖిలేష్ యాదవ్ గొప్పగా ఎన్నికల ప్రచారంలో దూకుడు చేశారు. కేజ్రీవాల్ క్రేజ్ చెప్పతరమా అన్నట్లుగా ఆయన స్పీడ్ ఒక రేంజిలో సాగింది. ఇలా ఇండియా కూటమిలో అందరు ఆటగాళ్ళూ తమ నూరు శాతం ప్రతిభను చూపించారు. మాటకు మాట అన్నట్లుగా మోడీ అమిత్ షాలకు పంచుల మీద పంచులు ఇచ్చారు. ఈసారి మోడీ అధికారంలోకి రారు ఇది నా గ్యారంటీ అంటూ రాహుల్ వేసిన సెటైర్ అదిరిపోలే అని అంటున్న వారూ ఉన్నారు. మోడీ భాషలో తేడా చూస్తే గెలుపు ఎవరితో చెప్పొచ్చు అని అఖిలేష్ పేల్చిన డైలాగ్ కూడా బెదరగొట్టేదే. ఇలా చూస్తూ పోతే ఎన్డీయే మీద నామమాత్రం పోటీ స్థాయి నుంచి గెలుపు మాదే అన్న దిశగా ఇండియా కూటమి కథను ఒడ్డుకు చేర్చారు ఎందరో మహానుభావులు. ఇక జనవరి 1వ తేదీతో ఏడవ విడత చివరి విడత లోక్ సభ ఎన్నికలు పూర్తి అవుతాయి. దాంతో సుదీర్ఘమైన సార్వత్రిక ఎన్నికల పోరు పరిసమాప్తం అవుతుంది. ఈ కీలక సమయంలో అంటే జనవరి 1వ తేదీన ఢిల్లీలో ప్రతిపక్ష ఇండియా కూటమి భేటీ కానుంది. ఇది అత్యంత కీలకమైన భేటీగా చెబుతున్నారు. ఎందుకంటే ఈ భేటీలో పోలింగ్ సరళిని సమీక్షిస్తారు. అలాగే కూటమి పెర్ఫార్మెన్స్ ని కూడా బేరీజు వేసుకుంటారు. హంగ్ పార్లమెంట్ వస్తే ఏమి చేయాలో కూడా ఆలోచిస్తారు. మరి ఇంతటి విశిష్టమైన భేటీకి అయితే తాము హాజరు కాబోమని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ స్పష్టం చేసింది. ఢిల్లీలో జరిగే ఈ సమావేశంలో లోక్ సభ ఎన్నికలు, జూన్ 4న ఫలితాలు, కూటమి భవిష్యత్తుపై చర్చించనున్నాయని తెలిసిన తరువాత కూడా మమత రాను అంటున్నారు అంటే ఆలోచించాల్సిందే అని అంటున్నారు. ఇండియా కూటమి సమావేశంపై టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మాట్లాడుతూ బెంగాల్ లో తొమ్మిది లోక్ సభ స్థానాల్లో అదేరోజు ఎన్నికలు ఉన్నందున తాను ఢిల్లీ సమావేశం కోసం రాలేనని చెప్పానని వెల్లడించారు. అలాగే పంజాబ్, బీహార్, ఉత్తర ప్రదేశ్‌లలో కూడా జూన్ 1న ఎన్నికలు ఉన్నాయని అందుకే ఢిల్లీకి వెళ్లడం ఆచరణాత్మకం కాదన్నారు. అంతే కాదు తమ సొంత రాష్ట్రంలో ఓ వైపు తుపాను మరోవైపు ఎన్నికలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో తనకు తుపాను సహాయ కార్యక్రమాలే తనకు తొలి ప్రాధాన్యత అన్నారు. ఏడో దశలో తమకు చాలా కీలకమైన ఎన్నికలు ఉన్నాయని పేర్కొన్నారు. ఆ రోజున కోల్‌కతా, గ్రేటర్ కోల్‌కతాలోని అన్ని స్థానాలకు పోలింగ్ ఉందని తెలిపారు. తమ పార్టీకి ఇది చాలా కీలకమని పేర్కొన్నారు. ఇంత ఖరాఖండీగా మమత చెప్పడంలోనే వేరే సౌండ్ తోస్తోంది అని అంటున్నారు. మమత ప్రధాని పీఠాన్ని ఆశిస్తున్నారు. ఇండియా కూటమి తన పేరుని ప్రతిపాదించాలని ఆమె కోరుకుంటున్నారు అని అంటున్నారు. అయితే ఆ రకమైన ఊసే లేదని తేలడంతోనే ఆమె ఇలా అంటున్నారు అన్నది ఒక ప్రచారంగా ఉంది. ఏది ఏమైనా ఎన్డీయే ఇండియా కూటమి నెక్ టూ నెక్ గా సీట్లు సాధిస్తే మమతా బెనర్జీ లాంటి వారు తీసుకునే నిర్ణయమే అత్యంత కీలకం అవుతుందని దేశ రాజకీయ దశ దిశను మారుస్తుందని అంటున్నారు.

# అక్రమాల ఆట.. కాసుల వేట!



కరీంనగర్ : కరీంనగర్‌లోని ఓ క్రీడా దుకాణానికి ఇద్దరు వ్యక్తులు ఇలా క్యారమ్ బోర్డులను మెట్లెక్కి తీసుకెళ్తున్నారు. జిల్లా యువజన, క్రీడల కార్యాలయానికి సంబంధించిన వీటిని దొడ్డిదారిన అందులోని సిబ్బంది విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దుకాణంలో నుంచి కొనుక్కొచ్చే వారు కిందకు దిగుతూ వస్తారు. కానీ వీరు అందుకు భిన్నంగా పైకి తీసుకెళ్తున్నారు. పైగా క్రీడాశాఖకు సంబంధించిన సామగ్రి ఎన్నడూ ఇలా ఒక్కోటి వచ్చిన దాఖలాలు లేవు. కొటేషన్ ఇచ్చిన దుకాణం నుంచే నేరుగా ప్యాకింగ్ రూపంలో సామగ్రి కార్యాలయానికి వస్తుంది. ఈ చిత్రంలో కనిపిస్తున్నదాన్ని బట్టి క్యారమ్ బోర్డులు విక్రయానికి తీసుకెళ్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

జిల్లా యువజన, క్రీడల కార్యాలయంతోపాటు అంబేద్కర్ మైదానంలో స్విమ్మింగ్ ఫూల్‌లో ఊడ్చేందుకు కొన్నాళ్ల కిందట ఓ వ్యక్తిని విధుల్లోకి తీసుకున్నారు. ఆయన మార్చి నెలలో కేవలం 10 రోజులు మాత్రమే విధుల్ని నిర్వర్తించారు. వేతనం మాత్రం నెల రోజులకు రూ.7,800లు చెల్లించారు. ఇలా పూర్తి వేతనం ఇచ్చినందుకుగానూ ఆయనకు కార్యాలయం సిబ్బంది ఒకరు ఫోన్ చేసి సగం డబ్బులను తన బ్యాంక్ ఖాతాకు మళ్లించాలని డిమాండ్ చేయడం, ఆ ఉద్యోగి రూ.3 వేలు మాత్రమే చెల్లిస్తానన్న ఆడియో బయటకు వచ్చింది.

జిల్లా క్రీడా శాఖలో రోజుకో వివాదం ఆ శాఖ ప్రతిష్ఠను దిగజారుస్తోంది. క్రీడాకారుల భవిష్యత్తుకన్నా.. తమకేంటి లాభమనే పంథాతో కొందరు వ్యవహరిస్తున్న తీరు ఆ శాఖకు మచ్చ తెస్తోంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ నామమాత్రంగా ఉంటుండటం, ఇక్కడ ఏళ్ల తరబడి పనిచేసిన కొందరి ఆధిపత్యమే కొనసాగుతుండటంతో కొన్ని విషయాల్లో వారు ఆడిందే ఆటగా మారిపోయింది. అధికారులు మారుతున్నా.. ఆరోపణలు ఆగడం లేదు.

### అసలేం జరుగుతోంది..?

జిల్లా యువజన, క్రీడల కార్యాలయం పరిధిలో అంబేద్కర్ మైదానంతోపాటు స్విమ్మింగ్ ఫూల్, క్రీడా పాఠశాల, క్రీడా మైదానాల నిర్వహణ సహా అప్పుడప్పుడు పలు టోర్నీలను నిర్వహిస్తున్నారు. ఇందుకోసం అడపాదడపా వస్తున్న నిధుల వినియోగం విషయంలో తరచూ ఆరోపణలు వస్తున్నాయి. పైగా తాత్కాలిక సిబ్బంది పని చేయకున్నా వారికి పూర్తి వేతనాలు చెల్లిస్తూ నిధులు పక్కదారి పట్టిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. గత నెలలో ఓ ఉద్యోగికి చెల్లించిన వేతనంపై రగడ జరుగుతోంది. అవసరమైన క్రీడా సామగ్రిని గతంలో ఒక దుకాణం నుంచే కొన్నారనే ఆరోపణలున్నాయి. ఇదే సమయంలో ఇటీవల నగరంలోని ఓ దుకాణంలో ఇక్కడి క్రీడా పరికరాల్ని అమ్ముకున్నారనే ఆరోపణలు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లాయి. గతంలోనూ ఇక్కడ జరిగిన పలు అభివృద్ధి పనుల విషయంలోనూ అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. నిధుల ఖర్చు విషయంలోనూ లెక్కాపత్రం సరిగ్గా ఉండటం లేదని ఆరోపణలున్నాయి. కాని కఠిన చర్యలు లేకపోవడంతో కొద్ది రోజులకే మరో వివాదం వస్తోంది. ఉన్నతాధికారులు స్పందించాలని, అక్రమాలపై కఠిన చర్యలు తీసుకోవాలని క్రీడాభిమానులు కోరుకుంటున్నారు.

### విచారణ జరుపుతాం

ఇటీవలే నాకు ఈ విషయాలపై ఫిర్యాదులు అందాయి. తక్షణమే విచారణ జరిపి తగు చర్యలు తీసుకుంటాం. క్రీడా దుకాణానికి క్యారమ్స్ తీసుకెళ్తున్న వారు మా సిబ్బందిలాగే ఉన్నారు. ఒకవేళ ఏవైనా సామగ్రి బాగాలేకుంటే మార్చడానికి తీసుకెళ్లారా.. కారణమేంటనేది విచారణ చేయిస్తాను. ఇది ఇటీవల జరిగింది కాదు. నేను నెల రోజుల కిందటే బాధ్యతలు చేపట్టాను. సిబ్బంది తక్కువగా ఉండటంతో కొన్ని విషయాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నా.. సేవల పరంగా ఎక్కడ లోటుపాట్లు లేకుండా శ్రద్ధను కనబరుస్తున్నాం. ఇక మీదట పర్యవేక్షణ పెంచుతా. శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా యువజన, క్రీడల అధికారి

# పంచాయతీలకు నిధుల లేమి!



కరీంనగర్ : నిధుల లేమితో గ్రామపంచాయతీలు కొట్టుమిట్టాడుతున్నాయి. అభివృద్ధి పనులు, మరమ్మతులకు ఆటంకంగా మారుతోంది. సర్పంచుల పదవీకాలం ఈ ఏడాది ఫిబ్రవరి 2తో ముగిసిపోగా నాలుగు నెలలుగా ప్రత్యేక అధికారుల పాలన నడుస్తోంది. వీరి పాలనకు ముందే పంచాయతీ ఖాతాలు ఖాళీ అయ్యాయి. సర్కారు నుంచి కొన్ని నెలలుగా నిధులు జమ కాకపోవటంతో పాలన మొక్కుబడిగా సాగుతోంది. కొందరు గ్రామ కార్యదర్శులు అక్కడక్కడా జేబు నుంచి పెట్టి చిన్నచిన్న పనులను లాక్కొస్తున్నారు. రానున్న వర్షాకాలంలో గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడకపోతే ప్రజలు జబ్బుల బారిన పడే అవకాశముంది.

### చేతులెత్తేసిన ప్రత్యేకాధికారులు..

పారిశుద్ధ్య కార్మికుల జీతాలు, పైపుల లీకేజీకి మరమ్మతు, బోర్ల మరమ్మతు పనులు పంచాయతీ ట్రాక్టర్ నెలవారి బ్యాంకు వాయిదా, గ్రామంలో విద్యుద్దీపాలు, నెలనెలా విద్యుత్తు బకాయిలు.. ఇవ్వన్నీ కచ్చితంగా చెల్లించాల్సిందే. ఈ బరువు బాధ్యతల గురించి ప్రత్యేక అధికారులు చేతులెత్తేసే తరహాలో ఉండటంతో గ్రామ కార్యదర్శులే భుజాన వేసుకొని వారికి వచ్చే జీతంలో కొద్దో, గొప్పో కార్మికులకు సగం సగం జీతం సర్దుబాటు చేస్తున్నట్లు కరీంనగర్ గ్రామీణ మండలంలోని ఓ గ్రామ కార్యదర్శి ఆవేదన వెలిబుచ్చారు. ఇప్పటికే ఒక్కో గ్రామ పంచాయతీ రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు అప్పు చేసి ఖర్చు చేసినట్లు సమాచారం. పంచాయతీల ప్రత్యేకాధికారులు ఖర్చుల విషయంలో చేతులెత్తేస్తుండటంతో భారమంతా కార్యదర్శులపైనే పడుతోంది. నాలుగు రోజులు ఉండి పోయే వాళ్లమని ప్రత్యేక అధికారులు దాట వేస్తున్నారని పలువురు కార్యదర్శులు ఆవేదన వ్యక్తం చేశారు.

### ఖాతాలు ఖాళీ..

గ్రామ పంచాయతీకి మూడు రకాల ఖాతాలు ఉంటాయి. ఒకటి ఆస్తి పన్ను జమ చేసుకునే ఖాతా... గ్రామాల్లో ఆస్తి పన్ను వసూలు అంతంత మాత్రంగా జరగటం, ఖర్చులు నాలుగింతలు ఉండటంతో ఇది ఎప్పుడు ఖాళీగానే ఉంటుంది. రెండో ఖాతా ఎస్ఎఫ్‌సీ (స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్) ఇందులో రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు జమ చేస్తారు. ఈ రెండు ఖాతాల్లో జమయ్యే మొత్తం ట్రెజరీ ద్వారా డ్రా చేయాల్సి ఉంటుంది. కానీ గత సర్కారు హయాంలో ఎస్ఎఫ్‌సీ నిధులు అరకొర మంజూరుతోనే సరిపెట్టింది. మూడో ఖాతా.. 15వ ఆర్థిక సంఘం నిధులు ఇందులో జమ అవుతాయి. కేంద్ర సర్కారు నేరుగా పంచాయతీలకు గ్రామ జనాభా ప్రాతిపదికన జమ చేస్తుంది. ప్రతి నాలుగు నెలలకోసారి వీటిని అందజేస్తోంది. కేవలం ఈ నిధులు మాత్రమే పంచాయతీలకు అందుతుండటం.. వీటిని ప్రత్యేక పనులకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. నిబంధనల మేరకు ఖర్చు చేయని నిధులు ఆయా ఖాతాల్లో మిగిలిపోగా మార్చిలో వాటిని రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి తీసుకున్నట్లు సమాచారం.

### నేటికీ బిల్లులు చెల్లించలేదు

పంచాయతీల పాలక మండలి గడువుకు ముందే అధికారుల ఒత్తిడితో పలు అభివృద్ధి పనులు చేశాం. వాటి బిల్లులు నేటికీ అందలేదు. ట్రాక్టర్ బ్యాంకు రుణ వాయిదాలు, డీజిల్ బిల్లులు చాలా పంచాయతీలు చెల్లించలేదు.

జక్కం నర్సయ్య, మాజీ సర్పంచి, మొగ్దుంపూర్, కరీంనగర్ గ్రామీణం

### త్వరలో సమస్య పరిష్కారం

క్షేత్రస్థాయిలో కొంత సమస్య ఉన్న వాట వాస్తవమే. ఏడాదిన్నరగా ఎస్ఎఫ్‌సీ నిధులు అందలేదు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ నడుస్తోంది. జూన్‌లో సమస్య పరిష్కారం అవుతుందని భావిస్తున్నాం. రాంబాబు, డీఎల్‌పీవో, కరీంనగర్

# కళాశాల బాట.. ప్రవేశాల ఊట!

మధిర : ప్రైవేటు కళాశాలలకు దీటుగా వసతులతో పాటు నాణ్యమైన విద్యాబోధనే ధ్యేయంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ముందుకు సాగుతున్నాయి. ఇందులో భాగంగా ఇప్పటికే కళాశాల బాట పేరిట ప్రధానాచార్యుల ఆధ్వర్యంలో అధ్యాపకులు.. విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్తున్నారు. తమ కళాశాలల్లో చేరాలంటూ కోరుతున్నారు. అక్కడి కోర్సులతో పాటు వసతులను వివరిస్తూ ఉత్తమ ఫలితాల సాధనకు చేపట్టే కార్యాచరణ గురించి అవగాహన కల్పిస్తున్నారు. మరికొద్ది రోజుల్లో కళాశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గత విద్యాసంవత్సరం కంటే ఈసారి అదనంగా ప్రవేశాలు సాధించాలనే లక్ష్యంతో అడుగులు వేస్తున్నారు.

### ఏటా పెరుగుతున్న ప్రవేశాల సంఖ్య

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చేరేందుకు విద్యార్థులు సైతం ఆసక్తి కనబరుస్తున్నారు. ఖమ్మం జిల్లాలో 20 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉండగా వీటిలో రెండేళ్ల కిందట 5,500 మంది విద్యార్థులు ప్రవేశాలు పొందగా.. గత విద్యాసంవత్సరంలో అదనంగా 600 మంది చేరారు. ఈ ఏడాది మరింత ప్రవేశాలు పెరిగేలా ప్రచారం సాగిస్తున్నారు. 2022లో 73 శాతం ఉత్తీర్ణత ఉండగా 2023లో 74 శాతానికి పెరగడం విశేషం. రాష్ట్రంలోనే విద్యార్థుల ప్రవేశం, ఉత్తీర్ణతలో ఖమ్మం జిల్లా ఆరు నుంచి ప్రస్తుతం 4వ స్థానానికి ఎగబాకింది. ఈ ఉత్సాహంతో ఈ విద్యాసంవత్సరంలో ప్రవేశాల సంఖ్య మరింత పెంచాలని ఇంటర్ విద్యాశాఖ ఉన్నతాధికారుల సూచనలతో సెలవుల్లోనూ సిబ్బంది కళాశాల బాట కార్యక్రమం నిర్వహిస్తున్నారు.

### ఒత్తిడి లేని విద్య అందిస్తాం



కళాశాలల్లో ప్రవేశాల సంఖ్యను మరింతగా పెంచేందుకు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నాం. పదో తరగతి విద్యార్థులను పరీక్షల సమయంలోనే ఆయా ఉన్నత పాఠశాలలకు వెళ్లి.. ప్రభుత్వ కళాశాలల్లోని కోర్సులు, బోధనా విధానంపై అవగాహన కల్పించాం. తిరిగి ఫలితాలు వెలువడిన తర్వాత మరోమారు విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి తల్లిదండ్రులను కలిసి ప్రచారం చేస్తున్నాం. వసతులతో పాటు ఒత్తిడిలేని విద్య, ఎన్ఎస్ఎస్, క్రీడలతో బోధన సాగిస్తామని వివరిస్తున్నాం.

కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి

# వృత్తి నైపుణ్యం.. మార్కెటింగ్ వ్యూహం

సిరిసిల్ల : ఒకప్పుడు జిల్లాలో ఉత్పత్తి అయ్యే కాటన్ వస్త్రాలకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉండేది. ప్రభుత్వ ఆర్డర్ల కేటాయింపులు, వాటిలోనూ పూర్తిగా పాలిస్టర్‌వి కావడంతో తొమ్మిదేళ్లు కాటన్ పరిశ్రమ కుదేలైంది. ఎప్పుడూ ఒకే రకమైన వస్త్రోత్పత్తులతో రాష్ట్రంలో సిరిసిల్లకు ప్రైవేటు మార్కెట్ తగ్గింది. పరోక్షంగా వస్త్రపరిశ్రమలో సంక్షోభం ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో చేనేత జౌళిశాఖ ఉత్పత్తి వైవిధ్యాన్ని (ప్రొడక్ట్ డైవర్సిఫికేషన్) ప్రోత్సహించేలా నిపుణులతో అధ్యయనం చేయించి, అందుకు అవసరమైన ప్రత్యామ్నాయాలు సూచించాలి. కానీ ఈ పద్ధతి చేనేతలోనే ఉంది. మరమగ్గాల్లో లేదు. దీంతో జిల్లా నేతన్నలు ప్రైవేటు ఉత్పత్తులతో ప్రత్యామ్నాయం చూసుకుంటున్నారు. మార్కెట్‌లో డిమాండ్, వస్త్రోత్పత్తుల్లో నైపుణ్యంతో ఇప్పటికే ముప్పై శాతం మంది సొంత ఉత్పత్తులను ప్రారంభించారు.

ప్రభుత్వ ఆర్డర్ల కోసం అయిదు నెలలుగా ఆసాములు, కార్మికుల ఎదురుచూపులతోనే కాలం కరిగిపోయింది. తొమ్మిదేళ్లలో మరమగ్గాలకు డాబీ, జకార్డులు అమర్చుకోవడంతోపాటు వాటితో వివిధ రకాల డిజైన్లతో ఉత్పత్తి చేయడం నేర్చుకున్నారు. ఆ నైపుణ్యమే ఇప్పుడు ప్రైవేటు ఆర్డర్లతో కొంత మేరకు ఆదుకుంటోంది. తువాళ్లు, చేతిరుమాళ్లు, లుంగీలు, దోమతెరలు, కండువాలు, టెంటుకు ఉపయోగించే వస్త్రం వంటి తదితర ఆర్డర్లు వస్తున్నాయి. వీటిలో కొందరు సొంతంగా వస్త్రోత్పత్తులు తయారు చేసుకుని చుట్టుపక్కల జిల్లాల్లో మార్కెట్లకు వెళ్లి విక్రయాలు చేస్తున్నారు. స్థానిక ఉత్పత్తులకు తోడు మహారాష్ట్ర, సూరత్, చెన్నైల నుంచి కాటన్, పాలిస్టర్ ఆర్డర్లు వస్తున్నాయి. రెండు నెలలుగా జిల్లా పరిశ్రమలో 30 శాతం పరిశ్రమ వర్గాలు సొంత మార్కెటింగ్ వైపు వెళ్లడంతో ఆసాములు, కార్మికుల జీవనం ఇప్పుడిప్పుడే గాడిలో పడుతోంది. ఇంకా సగానికిపైగా ఆసాములు, కార్మికులకు



ఉపాధి లేక బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు.

### నవీకరణతోనే మనుగడ

ప్రభుత్వ ఆర్డర్లు అనేవి ఎప్పుడూ ఉంటాయనే నమ్మకంతో ఉంటే ఇబ్బందులు తప్పవని ముందే గ్రహించాను. నాకున్న 12 సాంచాలపై ఎలాంటి ఉత్పత్తులనైనా చేసేలా నవీకరణ చేసుకున్నాను. వ్యాపారులు తమకు అవసరమైన కాటన్ ఉత్పత్తుల ఆర్డర్లు ఇస్తున్నారు. వారి నమ్మకాన్ని వమ్ముచేయకుండా నాణ్యతతో వస్త్రాలు ఉత్పత్తి చేసి ఇస్తున్నాను. నాతోపాటు మరో ముగ్గురు కార్మికులు ఉపాధి పొందుతున్నారు.

మారుతి, ఆసామి, పద్మనగర్, సిరిసిల్ల


### ముడి సరకుతో ఆసాములకు ఉపాధి

నేను వరుసగా నాలుగేళ్లు బతుకమ్మ చీరలను ఉత్పత్తి చేశాను. ప్రభుత్వ ఆర్డర్లు జనవరిలోనే రావాల్సి ఉండేది. వాటికోసం వేచిచూడకుండా ముడి సరకు తెచ్చుకుని సొంతంగా ఉత్పత్తి చేయడం మొదలు పెట్టాను. ఇలా ఉత్పత్తి చేసిన వాటిని కరీంనగర్, వరంగల్ మార్కెట్లకు తీసుకెళ్లి విక్రయిస్తున్నాను. అక్కడి ఉత్పత్తులకు భిన్నంగా చేయాలనే ఆలోచనతో నాతో పాటు మరో పదిహేను మంది ఆసాములకు ముడిసరకు ఇచ్చి వస్త్రోత్పత్తులు నేయిస్తున్నాను. ఇప్పటికే దాదాపు 70 మగ్గాలపై 30 మంది కార్మికులకు నాలుగు నెలలుగా ఉపాధి లభిస్తుంది.ఎ్ంగ రవీందర్, ఆసామి,జేపీనగర్, సిరిసిల్ల వచ్చిన పని చేయడం ఉత్తమం– తౌర్ర రవి, కార్మికుడు, రాజీవ్‌నగర్‌నేను పని చేస్తున్న కారా?నాలో మా యజమాని ప్రైవేటు ఆర్డర్లు తీసుకొచ్చారు. వాటితో మూడు నెలలుగా ఉపాధి పొందుతున్నాను. బతుకమ్మ చీరల ఉత్పత్తిలో రోజుకు సుమారు రూ.900 వరకు కూలి గిట్టుబాటు అయ్యేది. ఈ ఉత్పత్తులతో రూ.600 వరకు లభిస్తుంది. ప్రభుత్వ ఆర్డర్ల కోసం వేచిచూడటం కన్నా ఇదే నయం. నాతో పాటు పని చేసే చాలా మంది కార్మికులు నెలల తరబడి పని లేక ఖాళీగా ఉన్నారు.

దోమతెరల ఆర్డర్లు వస్తున్నాయి ప్రభుత్వ ఆర్డర్లనే పూర్తిగా నమ్ముకుంటే ఎప్పుడో ఒకసారి పస్తులు తప్పవని ముందే గ్రహించాను. మా యజమాని మహారాష్ట్ర, కర్ణాటక నుంచి దోమతెరల ఆర్డర్లు తీసుకొచ్చి ఇస్తుంటారు. ఆరు మగ్గాలపై నేను, నా భార్య ఇద్దరం రెండు షిఫ్టుల్లో ఉత్పత్తి చేస్తాం. ఏడాదిలో రెండు నెలలు కొద్దిగా తక్కువ ఉంటుంది. రెండు సంవత్సరాలుగా నిరంతరాయంగా పని లభిస్తోంది.– ఎనుగుల లక్ష్మణ్, ఆసామి, రాజీవ్‌నగర్

# ఎన్నికల వేళ తగ్గిన రిజిస్ట్రేషన్లు

కరీంనగర్ : ఎన్నికల కారణంగా గతేడాదితో పోల్చితే ఈసారి రిజిస్ట్రేషన్లు తగ్గాయి. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా అన్ని రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో ఈ ఏడాది ఆదాయం విపరీతంగా తగ్గింది. గత ఏడాది 2023లో జనవరి నుంచి మే వరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 40,449 రిజిస్ట్రేషన్లు కాగా రూ.13,671.51 లక్షల ఆదాయం వచ్చింది. ఎన్నికల కోడ్ సందర్భంగా ఈ ఏడాది జనవరి నుంచి మే 22 వరకు 34,686 రిజిస్ట్రేషన్లగాను రూ.10,515.82 లక్షలు వచ్చాయి. గత



ఆదాయాన్ని పోల్చి చూస్తే ఈ ఏడాది రూ.3155.69 లక్షలు తక్కువగా వచ్చింది.కారణాలు ఇలా..భూముల క్రయవిక్రయాల్లో ఎక్కువగా ఉద్యోగులు, వ్యాపారులు, రాజకీయ నాయకులు ఉంటుంటారు. ఎన్నికలు వేళ వారు బిజీగా ఉండటంతో క్రయవిక్రయాలు తగ్గిపోయాయి. దీనికితోడు ఎన్నికల సందర్భంగా ఎన్నికల కోడ్ విధించడంతో నగదు అక్రమ రవాణా అరికట్టేందుకు ఎన్నికల కమిషన్ పలు బృందాలు ఏర్పాటు చేసింది. పలువురు క్రయ విక్రయదారులు రిజిస్ట్రేషన్లు చేసుకునే క్రమంలో వారి దగ్గర ఉన్న నగదుకు ఆధారాలున్నా అప్పటికప్పుడు వాటిని చూపించకపోతే ఆ నగదును సీజ్ చేస్తారు. ఈ క్రమంలో సాధారణ వ్యక్తులు కూడా ఎన్నికల కోడ్ తర్వాతే రిజిస్ట్రేషన్ చేసుకుందామని వేచి చూశారు. ఈ రెండు కారణాలతో కార్యాలయానికి వచ్చే వారి సంఖ్య తగ్గిపోయింది.

# ఘాటుగా చెప్తేనే వింటారా?

హైదరాబాద్ : ఫార్మా, బల్క్‌డ్రగ్ పరిశ్రమల నుంచి వెలువడే ఘాటు వాసనలను నియంత్రించడానికి వీవోసీ వోల్‌టైల్ (ఆర్గానిక్ కాంపౌండ్స్) మీటర్లు బిగించాలని పీసీబీ ఆదేశిస్తున్నా.. కొందరు పరిశ్రమల నిర్వాహకులు పట్టించుకోవడం లేదు. కార్మికులు తిరిగే ప్రాంతాలు, నివాస స్థలాలకు సమీపంలో ఉన్న పరిశ్రమల్లో వీటిని బిగించి ఉద్గారాలను తగ్గించాలని పీసీబీ సూచిస్తోంది. వీవోసీ హ్యాండ్ మెషీన్లు, ఆన్‌లైన్ మీటర్లు బిగించి పీసీబీ సర్వర్‌కు అనుసంధానించాలని చెబుతున్నా.. ఖర్చుతో పాటు నిఘా ఉంటుందని కొందరు వెనకడుగు వేస్తున్నారు. దీంతో ఆయా పరిశ్రమలపై పీసీబీకి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పరిశ్రమల నిర్లక్ష్యంతో వాయునాణ్యతను ప్రభావితం చేసే బెంజీన్, ఇథిలీన్ గ్లైకాల్, ఫార్మాల్డిహైడ్, మిథైలీన్ క్లోరైడ్, టెట్రాక్లోరో ఇథైలీన్, టోలున్, జీలిన్ వంటి అస్థిర కర్బన సమ్మేళనాలు గాలిలో కలిసి వాయునాణ్యతపై ప్రభావం పడుతోంది.

కొన్నింటిపై చర్యలు.. మరికొన్నింటికి సూచనలు

అనుమతులు లేకుండా బల్క్ డ్రగ్ ఉత్పత్తులు తయారు చేయడం, నిబంధనలకు విరుద్ధంగా రెండు కేఎల్ సామర్థ్యంతో రియాక్టర్ల ఏర్పాటు, సింగిల్ స్టేజ్ స్క్రబ్బర్ల వినియోగంతో కాలుష్య ఉద్గారాలు పెరగడంతో మేడ్చల్‌కు చెందిన కొఠారు ల్యాబరేటరీస్‌పై పీసీబీ చర్యలు తీసుకుంది. మూసివేతకు ఆదేశాలిచ్చింది. ఆ సంస్థ కొన్ని నెలలకే నిబంధనల ప్రకారం పీసీబీ సూచించిన మేరకు స్క్రబ్బర్లు, బాయిలర్లు ఏర్పాటు చేయడంతో తిరిగి ఆ పరిశ్రమ తెరిచేందుకు ఆమోదం తెలిపింది. జీడిమెట్లలోని లక్సాయ్ లైఫ్ సైన్సెస్‌కు పీసీబీ పలు మార్గదర్శకాలు జారీచేసింది. బహిరంగ ప్రదేశాల్లో ఉద్గారాలు వదులుతున్నట్టు ఫిర్యాదులు రావడంతో అధికారుల బృందం తనిఖీలు నిర్వహించి వీవోసీ మానిటరింగ్ వ్యవస్థ ఏర్పాటు చేసుకోవాలని సూచించింది. కాలుష్య ఉద్గారాలను తగ్గించేలా స్క్రబ్బర్‌కి హెచ్‌టీడీఎస్ ఎఫ్లూయెంట్ స్టోరేజ్ ట్యాంకులకు అనుసంధానించాలని సూచించింది. వీవోసీ మానిటరింగ్ వ్యవస్థ, వెంట్ కండెన్సర్‌ల వినియోగంతో ఉ



ద్గారాలు నియంత్రించాలని సూచించింది. మల్లాపూర్‌కు చెందిన మురళి కెమికల్స్, శోధన ల్యాబరేటరీస్‌కు ఉద్గారాల నియంత్రణకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది.

ఖర్చుతో పాటు నిఘా ఉంటుందనే..

నగరంలో 1500కు పైగా రెడ్ కేటగిరీ పరిశ్రమలు ఉన్నాయి. ఇక్కడి వాతావరణంలో వాయునాణ్యత, గాలిలో కలిసే అస్థిర కర్బన సమ్మేళనాల స్థాయులను తెలుసుకునేలా ఆన్‌లైన్ మానిటరింగ్ వ్యవస్థను పీసీబీ సర్వర్‌కు అనుసంధానించాలన్న నిబంధనలు ఉన్నాయి. కాలుష్యం పెరిగినప్పుడల్లా అప్రమత్తం చేయడంతో పాటు ఎందుకు పెరుగుతుందో వివరాలు సమర్పించాలని పీసీబీ సదరు నిర్వాహకులకు నోటీసులు పంపుతుంది. వివరణ ఇచ్చిన తర్వాత అదే పరిస్థితి ఉంటే టాస్క్‌ఫోర్స్ బృందాన్ని పంపి లోపాలు ఎక్కడున్నాయో గుర్తించి మార్గదర్శకాలు జారీ చేస్తుంది. ఆన్‌లైన్ మెషీన్లకు ఎక్కువ మొత్తంలో ఖర్చవుతుండటం, పైగా పీసీబీ నిఘా ఉంటుందని నిర్వాహకులు వీటిని వినియోగించడం లేదు. దీంతో ఘాటు వాసనలతో ఉక్కిరిబిక్కిరవుతున్న స్థానికులు పీసీబీకి వరుసగా ఫిర్యాదులు చేస్తున్నారు. ఆయా పరిశ్రమల సమీపంలో టాస్క్‌ఫోర్స్ బృందం తనిఖీ చేసినప్పుడల్లా 5 పీపీఎం కంటే ఎక్కువగానే సూచిక చూపుతుండటం గమనార్హం.

# పనులు నత్తనడక.. మంచినీళ్లు సరిపడక..

హైదరాబాద్ : రాజధాని నగర శివారులోని కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో అధికార యంత్రాంగం సరఫరా చేస్తున్న తాగునీరు ఏమాత్రం సరిపోవడం లేదు. వేసవిలో తాగునీటి సరఫరా సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ప్రైవేటు ట్యాంకర్లు, తాగునీటి పీపాలను కొనుక్కొంటున్నారు. గ్రేటర్ సరిహద్దు దాటిన వెంటనే ఉన్న ఏడు కార్పొరేషన్లు, 21 మున్సిపాలిటీల్లో.. మరికొన్ని చోట్ల మూడురోజులకోసారి నీళ్లొస్తున్నాయి. బాహ్యవలయ రహదారిలోపలున్న మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తాగునీటి అవసరాలు తీర్చేందుకు రెండేళ్ల క్రితం రూ.1750 కోట్లను అప్పటి ప్రభుత్వం మంజూరు చేయగా.. రూ.982కోట్లు మాత్రమే విడుదలయ్యాయి. మిగతా నిధుల కొరత, సమన్వయలేమి కారణంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి. జలమండలికి సమాంతరంగా మిషన్ భగీరథ అధికారులు ఓవర్‌హెడ్ ట్యాంకులు, తాగునీటి పైప్‌లైన్ల పనులు ప్రారంభించినా.. అవికూడా అంతంత మాత్రంగానే జరుగుతున్నాయి.

ఖాళీగా రిజర్వాయర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకర్లు..మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో తాగునీటి అవసరాల కోసం అన్నిచోట్లా రిజర్వాయర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకర్లను నిర్మించారు. పైప్‌లైన్‌ల ద్వారా రిజర్వా యర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకర్లలో నీటిని నిల్వ ఉంచి కాలనీలు, వార్డులకు సరఫరా చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. రిజర్వాయర్లు, ఓవర్‌హెడ్ ట్యాంకర్ల నిర్మాణం పూర్తైనా వాటిల్లో నీళ్లు నింపేందుకు జలమండలి, మిషన్ భగీరథ అధికారుల వద్ద నీటినిల్వలు లేవు. గతేడాది శాసనసభ ఎన్నికల సందర్భంగా అప్పటి ప్రభుత్వం తాగునీటిని అందుబాటులోకి తీసుకొచ్చామని చెప్పుకొనేందుకు రెండు,మూడు రోజుల పాటు ట్రయల్ రన్ ద్వారా వాటిని అందించింది. ప్రభుత్వం మారిపోయాక అధికారులు పెండింగ్ పనులకు నిధుల్లేక నిదానంగా పనులు చేస్తున్నారు. తుర్కయాంజాల్ మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి కోసం రిజర్వాయర్ నిర్మించినా.. దానికి అవుట్‌లెట్ లేకపోవడంతో నీటిని నిల్వచేయడం లేదు.

కార్పొరేషన్లలో కటకట.. మూడు లక్షలకుపైగా జనాభా ఉన్న నిజాంపేట కార్పొరేషన్‌కు జలమండలి, మిషన్ భగీరథ అధికారులు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. కార్పొరేషన్ పరిధిలో 13వేల నల్లాకనెక్షన్లు ఉండగా.. 33ఎంఎల్‌డీల నీరు ఇవ్వాలి. అధికారులు సరఫరా చేస్తోంది 25ఎంఎల్‌డీలే. బండ్లగూడజాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో జలమండలి ఆధ్వర్యంలో చేస్తున్న నీటిసరఫరా అస్తవ్యస్తంగా మారింది. డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా చేయకపోతుండటంతో ప్రజలు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. కార్పొరేషన్ పరిధిలో 1.50 లక్షల జనాభా, 149 కాలనీలు.. 35వేలకు పైగా నివాస గృహాలు ఉన్నాయి. కొన్ని కాలనీలకు ఇప్పటికీ తాగునీటి సరఫరా వ్యవస్థ లేదు.పీర్జాదిగూడ కార్పొరేషన్‌లో రోజుకు కోటి లీటర్ల డిమాండ్ ఉండగా... యాభైలక్షల లీటర్లు మాత్రమే అధికారులు సరఫరా చేస్తున్నారు. పైపులైన్ల కోసం రూ.150కోట్లు ఖర్చుచేసినట్లు అధికారులు చెపుతున్నా కొన్ని ప్రాంతాల్లో నేటికీ నాలుగైదు రోజులకోసారి కానీ తాగునీరు అందడం లేదు.బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని 28 డివిజన్లలో నివసిస్తున్న ప్రజలు తాగునీటికోసం ఇప్పటికీ ఎదురుచూపులు చూస్తున్నారు. సుమారు 3 లక్షల జనాభా నివస్తున్న బోడుప్పల్‌లో చెంగిచర్ల ప్రాంతం అదనం. దాదాపు 100 కాలనీలకు సరైన నీటి సరఫరా యంత్రాంగమే లేదు.

# కమిటీల ఏర్పాటు.. ఉద్యోగినులకు తోడ్పాటు



వికారాబాద్ : ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహించే మహిళా ఉద్యోగుల రక్షణకు సర్కారు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొదటగా మున్సిపల్ కార్యాలయాల్లో లైంగిక వేధింపులకు అడ్డుకట్ట వేసేందుకు అంతర్గత కమిటీలను ఏర్పాటు చేయాలని పురపాలిక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో జిల్లా వ్యాప్తంగా ఉన్న పురపాలికలు ఆ దిశగా దృష్టి సారించాయి. పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగినులపై వేధింపులు కొనసాగుతున్నాయని, తగిన చర్యలు తీసుకోవాలని పలు స్వచ్ఛంద సంస్థలు, వామ పక్ష నాయకులు కూడా అధికారులకు విజ్ఞప్తి చేశారు. అంతేకాకుండా చాలా చోట్ల ఇదే విషయమై ఆరోపణలు రావడంతో రాష్ట్ర పురపాలిక శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.జిల్లా కేంద్రంలో కమిటీ ఏర్పాటు చేయగా, తాండూరు, పరిగి, కొడంగల్‌లో త్వరలో ఏర్పాటు చేయనున్నారు. గతంలో అనేక సార్లు జిల్లాలో సంఘటనలు జరిగినా బయటకు రాకుండా చేశారు. ఇకపై ఉద్యోగినులను వేధిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. ఇలాంటి విషయాలను ఉపేక్షించవద్దని స్పష్టం చేశారు. ఉత్తర్వులు ఏప్రిల్‌లో జారీ అయినా, లోక్‌సభ ఎన్నికల ప్రక్రియలో అధికారులు నిమగ్నమై ఉన్నందున వీటి ఏర్పాటుపై దృష్టి సారించలేదు. పోలింగ్ ముగియడంతో కమిటీల ఏర్పాటుపై కమిషనర్లు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలోని నాలుగు పురపాలికల్లో వివిధ హోదాల్లో మహిళా ఉద్యోగులు, కార్మికులు విధులు నిర్వహిస్తున్నారు.

నియామకం ఇలా: పురపాలికల్లో విధులు నిర్వహించే మహిళకు రక్షణ కల్పించేందుకు 2013లో వచ్చిన చట్టాన్ని పరిగణనలోకి తీసుకుని కమిటీలు ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. కమిటీకి సీనియర్ మహిళా ఉద్యోగినిని ప్రిసైడింగ్ అధికారిగా నియమించాలని ఉత్తర్వులో పేర్కొన్నారు. వారు లేకపోతే ఇతర ప్రభుత్వ కార్యాలయాల వారికి బాధ్యతలు అప్పగించాలని సూచించింది. అధికారితోపాటు మరో ఇద్దరిని సభ్యులుగా నియమిస్తారు. వీరికి మహిళా చట్టాలపై అవగాహన, సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్న అనుభవం ఉండాలి. సమస్యలపై పోరాటం చేసే ప్రైవేట్ వ్యక్తులకు అవకాశం కల్పించాలని అధికారులు ఉత్తర్వులో పేర్కొన్నారు. ఉద్యోగినులపై ఎవరైనా వేధింపులకు పాల్పడితే కమిటీ విచారించి ఉన్నతాధికారులకు పూర్తి నివేదికను సమర్పించి బాధ్యులపై చర్యలు తీసుకునేలా తోడ్పాటు అందిస్తుంది. వీటి ఏర్పాటుతో రక్షణ లభిస్తుందని పలు మహిళా సంఘాలు ఆశిస్తున్నాయి. వికారాబాద్ పురపాలికలో ముగ్గురు మహిళా ఉద్యోగినులతో కమిటీ ఏర్పాటు చేశామని వికారాబాద్ మున్సిపల్ కమిషనర్ జాకీర్ అహ్మద్ తెలిపారు. పని ప్రదేశంలో వేధింపులకు గురి చేస్తే దర్యాప్తు చేసి నివేదిక సమర్పించాల్సి ఉంటుందన్నారు.

# రక్తశుద్ధి.. ఆరోగ్య సిద్ధి



తాండూరు : మూత్రపిండాల వ్యాధిగ్రస్థులకు సాంత్వన చేకూర్చేందుకు ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా నాలుగు సర్కార్ దవాఖానాల్లో డయాలసిస్ కేంద్రాలను ఏర్పాటు చేసింది. కార్పొరేట్ స్థాయిలో ఆధునిక వసతులు కల్పించి వైద్య సేవలను అందుబాటులోకి తేవడంతో బాధితులకు హైదరాబాద్ వెళ్లే అవస్థలు తప్పాయి. స్థానికంగా ఉచిత సేవలు అందడంతో వారికి ఊరట కలిగింది. అయితే కొన్ని చోట్ల వసతులు సరిగా లేవని పూర్తిస్థాయిలో కల్పించాలని వారు కోరుతున్నారు. తాండూరు జిల్లా ఆసుపత్రి, వికారాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, పరిగి, కొడంగల్ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో రక్తశుద్ధి సేవలను అందిస్తున్నారు. వికారాబాద్‌లో 2018 జనవరిలో సేవలు ప్రారంభించడంతో వికారాబాద్ పరిసర మండలాలతో పాటు, ఇతర మండలాలకు చెందిన వారు ఇక్కడ చికిత్స పొందుతున్నారు. పరిగి కేంద్రంలో కుల్కచర్ల, దోమ, పూడూరు మండలాల వారు, తాండూరు, కొడంగల్‌లో ఆ పరిసర గ్రామాల వారు కేంద్రాలను వినియోగించుంటున్నారు. కొడంగల్ కేంద్రంలో ఫర్నిచర్ లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులను బయట తెచ్చుకోమ్మని అక్కడి సిబ్బంది సూచిస్తున్నారని రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.జిల్లా వ్యాప్తంగా 23 పడకలు: తాండూరులో 8, వికారాబాద్, పరిగి, కొడంగల్ కేంద్రాల్లో 5 చొప్పున పడకలున్నాయి. తాండూరు 50, వికారాబాద్ 40, పరిగి 30, కొడంగల్ 35 మందికి సేవలు అందుతున్నాయి. పడకల ప్రకారం రక్తశుద్ధి చేస్తున్నారు. ఒక్కొక్కరికి నాలుగు గంటల పాటు సేవలందిస్తున్నారు. మందులు ఉచితంగా సరఫరా చేస్తున్నారు.

అంతా అధునాతనమే: డయాలేజర్‌ను మామూలుగా రోగికి 12, 13 సార్లు వినియోగిస్తారు. ప్రతి రోగికి ఒక పరికరాన్ని వినియోగించేలా జర్మనీ సంస్థ ప్రతినిధులతో ఒప్పందం చేసుకున్నారు. ఈ అధునాతనమైన విధానం కేవలం ప్రభుత్వ ఆస్పత్రిలోనే అందుబాటులో ఉంది. గతంలో వైద్యానికి నగరానికి వెళ్లిన ప్రతి సారి ఒక్కరికి అన్ని ఖర్చులు కనీసం రూ.10 వేల నుంచిరూ.15 వేల వరకు అయ్యేది. ఇప్పుడా పరిస్థితి తప్పింది.

పింఛన్ సౌకర్యం: రక్తశుద్ధి చేయించుకునే వారికి నెలకు రూ.2016 పింఛన్ అందుకుంటున్నారు. నాలుగు కేంద్రాల్లోని చికిత్స పొందుతున్న వారికి ఇది వర్తిస్తుంది. డయాలసిస్ చేసుకుంటున్నట్లు ధ్రువపత్రంతో దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరు చేస్తారు.

40 మందికి సేవలందిస్తున్నాం- మహ్మద్ రిజ్వాన్, ఇన్‌ఛార్జి, వికారాబాద్

ఈ కేంద్రంలో ప్రస్తుతం 40 మందికి రక్తశుద్ధి చేస్తున్నాం. ఒక్కొక్కరికి నెలకు 12 సార్లు సేవలు అందించాల్సి ఉంటుంది. వికారాబాద్ పరిసర మండలాలకు చెందినవారు, స్థానికులు ఇక్కడికి వస్తున్నారు. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే చికిత్స చేస్తున్నాం. ముందుగా పేరు నమోదు చేసుకుని దరఖాస్తు చేసుకోవాలి. ప్రతి రోగికి నెలకు నాలుగు ఇంజక్షన్లు ఇస్తాం. అంతే కాకుండా ఇనుముకు సంబంధించినవి రెండు ఇస్తాం.

పింఛన్ రావడం లేదు: జ్ఞానేశ్వర్, ధన్నారం

జనవరి నుంచి పింఛన్ రావడం లేదు. ఎందుకు నిలిపివేశారో తెలియడం లేదు. 2021 నుంచి చికిత్స చేయించుకుంటున్నా. వికారాబాద్‌లో కేంద్రం ఏర్పాటుతో రోగులకు సౌకర్యంగా మారింది.

సేవలు బాగున్నాయి

– ఎల్లయ్య, బూచన్‌పల్లి, మర్పల్లి

వికారాబాద్ కేంద్రంలో సేవలు బాగున్నాయి. ఆరు నెలలుగా చికిత్స పొందుతున్నా. పింఛన్ ఇస్తారన్న విషయం ఇప్పుడే తెలిసింది. దరఖాస్తు చేస్తా. ప్రభుత్వ దవాఖానాలో సేవలు అందించడం మంచి పరిణామం.

# పాత ఇళ్ల పై నిర్లక్ష్యం వద్దు

హైదరాబాద్: నగరానికి నాలుగు వందల ఏళ్ల చరిత్ర ఉంది. ఏళ్ల నాటి కట్టడాలు నగరంలో కనిపిస్తుంటాయి. వర్షాకాలం మొదలవడంతో వాటి పరిస్థితి ఎలా ఉందనే విషయంపై జీహెచ్‌ఎంసీ దృష్టి పెట్టింది. నగరవ్యాప్తంగా సర్వే చేపట్టింది. 459 శిథిల భవనాలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. కూలేందుకు సిద్ధంగా ఉన్నవి, మరమ్మతులతో కాపాడుకోగలిగినవి వంటి పలు విభాగాలుగా విభజించి తగు చర్యలు తీసుకుంటున్నట్లు కమిషనర్ రోనాల్డ్‌రాస్ తెలిపారు. జీహెచ్‌ఎంసీ గుర్తించిన శిథిల భవనాల్లో సగం మేర మట్టిగోడలతో కట్టిన పెంకుటిళ్లు రేకుల షెడ్లు, గుడిసెలు ఉండగా.. మరో సగం రాతి కట్టడాలు, పాత కాలం నాటి బంగ్లాలు ఉన్నాయి. మట్టి గోడలతో ఉన్న నిర్మాణాలు ఎప్పటికైనా ప్రమాదమేనని, వాటిని కూల్చి కొత్త భవనాలను నిర్మించుకోవడం ఉత్తమమని ఇంజినీర్లు సూచిస్తున్నారు. రాతి గోడలు, ఉక్కు దిమ్మెలతో నిర్మించిన భవనాలను మాత్రం.. ఇంజినీర్ల సూచనతో కొత్తగా తీర్చిదిద్దుకోవచ్చని నిపుణులు పేర్కొంటున్నారు. గోడల పటిష్టతను శాస్త్రీయంగా పరీక్షించాక, వాటి నాణ్యత ఆశాజనకంగా ఉన్నప్పుడు.. పాత పైకప్పును తొలగించి, బంగ్లాకు పూర్వ వైభవం తీసుకొచ్చే చర్యలు చేపట్టవచ్చని స్పష్టం చేస్తున్నారు.

గుర్తించిన వాటిలో..జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో 459 శిథిల భవనాలను గుర్తించగా, గతేడాది బల్దియా పరిధిలో 231 శిథిల భవనాలను కూల్చివేశామని, 294 భవనాలకు మరమ్మతులు జరిపించినట్లు అధికారులు పేర్కొన్నారు. ఈ ఏడాది కూడా ప్రమాదకరంగా ఉన్న భవనాలపై దృష్టి పెట్టామని, కూల్చక



తప్పదనుకున్న వాటిని ఇంజినీరింగ్ నిపుణుల సూచన మేరకు నేలమట్టం చేస్తున్నామని, కొన్నింటికి మరమ్మతులు చేసుకునేలా యజమానులకు అవకాశం ఇవ్వడం, మరికొన్నింటికి తాళం వేయడం, ఇతరత్రా చర్యలు తీసుకుంటున్నట్లు ప్రణాళికా విభాగం తెలిపింది. పౌరులు సైతం 040-2111 1111కు ఫోన్ చేసి వర్షాకాలం కూలే అవకాశమున్న నిర్మాణాల గురించి సమాచారం ఇవ్వొచ్చని జీహెచ్‌ఎంసీ తెలిపింది.

# ఎంఎన్‌జేలో ట్విన్ టవర్లు!

హైదరాబాద్: నగరంలోని ప్రభుత్వ క్యాన్సర్ ఆసుపత్రి ఎంఎన్‌జేను విస్తరించనున్నారు. ప్రస్తుత ఆసుపత్రి వెనుక భాగంలో ఉన్న స్థలంలో ట్విన్ టవర్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధంచేశారు. మొత్తం రూ.110 కోట్లతో కొత్త భవనాలు నిర్మించనున్నారు. ఫలితంగా అదనంగా 500 పడకలు అందుబాటులోకి రానున్నాయి. ప్రస్తుతం ఆసుపత్రిలో 750 పడకలున్నాయి. ఏటేటా రోగుల సంఖ్య పెరుగుతోంది. ఎంఎన్‌జేలో అధునాతన సేవలు కూడా అందుబాటులోకి వస్తున్నాయి. ఈ నేపథ్యంలో అదనపు పడకల అవసరం ఏర్పడుతోంది. ప్రభుత్వం నుంచి లేదా సీఎస్ఆర్ కింద వివిధ ప్రైవేటు సంస్థలు కూడా అదనపు భవనాలు నిర్మించేందుకు సంసిద్ధత వ్యక్తం చేస్తున్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన వెంటనే కొత్త భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టనున్నారు.

రూ.30 కోట్లతో ట్రూబీమ్ థెరపీ




రేడియేషన్ చికిత్సల్లో అత్యాధునికమైన ట్రూబీమ్ థెరపీ సేవలు సైతం ఎంఎన్‌జేలో అందుబాటులోకి వచ్చాయి. ఇటీవలి రూ.30 కోట్లతో ఈ-రేడియేషన్ యంత్రాన్ని ప్రారంభించారు. ట్రూబీమ్‌తో క్యాన్సర్ కణితిని మాత్రమే కచ్చితమైన లక్ష్యంతో లోతుగా ధ్వంసంచేస్తాయి. ఎంఎన్‌జేలో ఈ చికిత్సలు పూర్తి ఉచితంగా అందిస్తుండటంతో రోగులకు ఎంతో ఊరట కలుగుతుందని, మున్ముందు మరిన్ని చికిత్సలు అందుబాటులోకి రానున్నాయని ఎంఎన్‌జే డైరెక్టర్ ముత్తా శ్రీనివాసులు తెలిపారు.

ఆసుపత్రి స్వరూపం...

ప్రస్తుతం ఆసుపత్రిలో పడకల సంఖ్య : 750
ఏటా కొత్త క్యాన్సర్ కేసుల నమోదు: 15,000
సమీక్షకు వచ్చే కేసులు: 1,50,000
ఏటా మేజర్ సర్జరీలు: 4500
మైనర్ శస్త్ర చికిత్సలు: 6000
రోజూ రేడియోథెరపీ చికిత్సలు: 300
నిత్యం కీమో థెరపీ చికిత్సలు: 300
ఏటా వివిధ రకాల టెస్టులు: 1.5 లక్షలు

# బంగారు బిస్కెట్ కావాలా నాయనా!

హైదరాబాద్: తక్కువ ధరకు పసిడి ఇప్పిస్తామంటూ బురిడీ కొట్టించి రూ.4కోట్లు కాజేశారు మాయగాళ్లు. బాధితుల ఫిర్యాదుతో నగర సీసీఎస్ పోలీసులు కేసు నమోదు చేశారు. రామంతాపూర్‌కు చెందిన విశాల్, వినయ్, అఖిల్ తేలికగా డబ్బు సంపాదించాలని పథకం వేశారు. గొలుసుకట్టు తరహాలో తక్కువ ధరకు బంగారు బిస్కెట్లు అంటూ ప్రచారం చేశారు. మహిళలు లక్ష్యంగా ఆకట్టుకునే ప్రకటనలు గుప్పించారు. ఆసక్తిగల వారి నుంచి రూ.50వేల నుంచి పెట్టుబడులు స్వీకరించారు. బంధువులు, స్నేహితులను సభ్యులుగా చేర్పిస్తే పెద్దమొత్తం కమీషనంటూ ఆశచూపటంతో చాలామంది వీరి ఉచ్చులో పడ్డారు. మార్కెట్ ధరకంటే 10 శాతం తక్కువకే మేలిమి బంగారం ఇస్తామంటూ నమ్మకం కలిగించారు. చేతికి వచ్చిన డబ్బుతో విలాసవంతమైన జీవితం గడుపుతూ దేశ, విదేశాల్లో పసిడి వ్యాపారం చేస్తున్నామంటూ బురిడీ కొట్టించారు. సభ్యుల నుంచి వసూలు చేసిన సొమ్ముతో విదేశాల్లో స్వర్ణం కొనుగోలు చేశామని, వచ్చిన లాభాలను పంచుతున్నామంటూ కొంతమేర చెల్లించారు. ఇది నిజమని నమ్మి.. సభ్యులు పెరుగుతూ వచ్చారు. భారీ మొత్తం సొమ్ము రాగానే వారంతా సెల్‌ఫోన్లు స్విచ్ఛాఫ్ చేశారు. దీంతో తాము మోసపోయినట్టు బాధితులు గుర్తించారు. అంబర్‌పేట్, రామంతాపూర్‌కు చెందిన ఇద్దరు తాము రూ.15లక్షలు చెల్లించామని వాపోయారు. బాధితులు మొత్తం రూ.4కోట్ల మేర నష్టపోయినట్టు ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో 19 మంది సభ్యులు బంగారు పథకం(గోల్డ్‌స్కీమ్) మాయలో పడి రూ.2.31కోట్లు పోగొట్టుకున్నట్టు అంచనా వేశారు.

బిగ్‌బాస్కెట్‌లో గడువుతీరిన వస్తువులు

ఇంటింటికి కూరగాయలు, ఇతర నిత్యావసరాలను అందించే బిగ్‌బాస్కెట్ మొబైల్ యాప్‌నకు సంబంధించిన కొండాపూర్ మసీద్‌బండ ప్రాంతంలోని గోదాములో తనిఖీలు నిర్వహించగా గడువు తీరిన మసాలాలు, ఇతర వస్తువులు లభ్యమైనట్లు ఫుడ్ ఇన్‌స్పెక్టర్ల టాస్క్‌ఫోర్స్ బృందం శుక్రవారం ప్రకటనలో తెలిపింది. చికెన్ మసాలా,



సాస్‌లు, పిజ్జా చీజ్, పనీర్, ఐస్‌క్రీమ్‌లు, బాదం మిఠాయి వంటి గడువు తీరిన పదార్థాలను స్వాధీనం చేసుకుని ధ్వంసం చేశామని అధికారులు వెల్లడించారు. నూనెతో తడిసిన నిత్యావసరాలు, సరిగా భద్రపరచని డెయిరీ వస్తువులు, ఇతరత్రా ఉల్లంఘనలను గుర్తించి నోటీసు ఇచ్చామని, లైసెన్సును రద్దు చేశామని స్పష్టం చేశారు.

రామేశ్వరం కేఫ్‌లోనూ..

మాదాపూర్ రామేశ్వరం కేఫ్‌లో మార్చి నెలలో గడువు ముగిసిన వంద కేజీల మినప పప్పు సంచులను, పెరుగు, పాల ప్యాకెట్లను గుర్తించి, అక్కడికక్కడే ధ్వంసం చేసినట్లు అధికారులు తెలిపారు. సవ్యంగా భద్రపరచని బియ్యం, బెల్లం, ఇతరత్రా ఉల్లంఘనలను గుర్తించామని, సరిచేసుకోవాలని తెలుపుతూ నోటీసు ఇచ్చామని వెల్లడించారు. మాదాపూర్‌లోని బాహుబలి కిచెన్‌లో అధిక మోతాదులో రంగు కలిపిన ఆహార పదార్థాలు, బొద్దింకలతో కలిసిపోయిన ఆహార పదార్థాలను, ఇతర అనారోగ్యకర వాతావరణాన్ని గుర్తించి, తగు చర్యలు తీసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ అధికారులు వెల్లడించారు.




## చిన్నారులను విక్రయిస్తున్న ముఠా అరెస్టు.. 16 మందిని రక్షించాం: రాచకొండ సీపీ

హైదరాబాద్: చిన్నారులను విక్రయిస్తున్న అంతర్‌రాష్ట్ర ముఠాను రాచకొండ కమిషనరేట్ పరిధిలోని మేడిపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ముఠా నుంచి 16 మంది చిన్నారులను కాపాడారు. వీరిలో కొందరు ఇతర రాష్ట్రాలకు చెందిన పిల్లలు ఉన్నట్టు గుర్తించారు. ఇటీవల మేడిపల్లిలో చిన్నారి విక్రయంతో ముఠా వ్యవహారం వెలుగులోకి వచ్చింది. నాలుగు రోజుల క్రితం పీర్జాదిగూడలో రూ. 4.50లక్షలకు ఆర్‌ఎంపీ డాక్టర్ శోభారాణి శిశువును విక్రయించారు. ఆమెకు సహకరించిన మరో ఇద్దరిని పోలీసులు అరెస్టు చేయడంతో ముఠాగుట్టు రట్టయింది. మొత్తం 16 మంది చిన్నారులను ఈ ముఠా విక్రయించినట్టు నిర్ధరించారు. కేసు వివరాలను రాచకొండ సీపీ తరుణ్ జోషి మంగళవారం మీడియాకు వెల్లడించారు. "ఈ రాకెట్‌తో సంబంధం ఉన్న ఏజెంట్లు, సబ్ ఏజెంట్లు మొత్తం ఎనిమిది మందిని అరెస్టు చేశాం.

ఇటీవల మేడిపల్లిలో శోభారాణి, సలీం, స్వప్నలను అరెస్టు చేశాం. వారిని అరెస్టు చేసిన సమయంలో ఇద్దరు చిన్నారులను రక్షించాం. సంతానం లేని వారికి పిల్లలను విక్రయిస్తున్నట్టు గుర్తించాం. దిల్లీ, పుణె నుంచి చిన్నారులను తీసుకొచ్చి అమ్ముతున్నట్టు దర్యాప్తులో తేలింది. దిల్లీ, పుణెలో ఉన్నవారిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందం వెళ్లింది. తల్లిదండ్రుల నుంచి రూ.50వేలకు కొనుగోలు చేసి.. రూ. 1.80 లక్షల నుంచి రూ. 5.50 లక్షల వరకు చిన్నారులను విక్రయిస్తున్నారు" అని రాచకొండ సీపీ తెలిపారు.




పుణెలో ఓ సంపన్న బాలుడు తప్పతాగి హైస్పీడు కారుతో యాక్సిడెంట్ చేసి ఇద్దరు టెకీల ప్రాణాలు తీసిన కేసులో కీలక విషయాలు వెలుగు చూస్తున్నాయి. తాజాగా నిందితుడి రక్తనమూనాలు మార్చేసేందుకు డబ్బును ఎలా, ఎంత చేతులు మారాయన్న విషయం బయటపడింది. ప్యూన్‌గా పనిచేసే అతుల్ ఘట్‌కాంబ్లే ఈ మొత్తం వ్యహారానికి మధ్యవర్తిగా వ్యవహరించినట్లు తేలింది. అంతేకాదు.. పోలీసులు వీరిని ముందే అనుమానించి కౌంటర్ ఆపరేషన్ నిర్వహించగా వైద్యులు అడ్డంగా దొరికిపోయారు. ఈ కేసులో ఇప్పటికే సాసూన్ ఆస్పత్రి వైద్యులు అజయ్ తావ్‌రే, శ్రీహరి హల్నోర్, అతుల్‌ను అరెస్టు చేశారు.

**ఏకంగా డాక్టర్ల రక్తనమూనాలే..** ప్రమాదం జరిగిన రోజు డాక్టర్ తావ్‌రే, నిందితుడి తండ్రి ఫోన్‌లో మాట్లాడుకున్నారు. ఈ సందర్భంగా నిందితుడి రక్తనమూనాలను మార్చేస్తే భారీ మొత్తం ఇచ్చేందుకు డీల్ కుదిరింది. ఈ నేపథ్యంలో తావ్‌రే తన ప్లాన్ కూడా అతడికి వివరించాడు. నిందితుడైన బాలుడి రక్త నమూనాలకు బదులు వేరే డాక్టర్ నమూనాలను ఆ స్థానంలో పెడతామని వెల్లడించాడు. వైద్య పరీక్షల్లో ఆల్కహాల్ ఆనవాళ్లు బయటపడ కూడదనే ఇలా చేశారు. ఈ వ్యవహారంలో డబ్బులు తీసుకొచ్చిన ప్యూన్ విచారణ సందర్భంగా ఒక దశలో ఆవేశంతో.. 'నన్ను ఇరికించారు కదా.. ఎవరినీ వదలను.. అందరినీ లాగుతా' అంటూ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

**డాక్టర్ శ్రీహరే మార్చేశారు..** ఈ వ్యవహారంపై పుణె పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ "ప్రమాదం జరిగిన రోజు ఉదయం 11 గంటలకు సాసూన్ ఆస్పత్రిలో బాలుడి రక్త నమూనాలు సేకరించాం. కానీ, అక్కడ వాటిని చెత్తబుట్టలో పారేశారు. మరో వ్యక్తి రక్తం తీసి దానిని పరీక్షలకు పంపారు. హెచ్‌వోడీ తావ్‌రే సూచనల మేరకు చీఫ్ మెడికల్ ఆఫీసర్ శ్రీహరి హల్నోర్ ఈ పనిచేసినట్లు తేలింది" అని వివరించారు. ఇక ఆ పరీక్షల్లో ఆల్కహాలు ఆనవాళ్లు రాలేదు.

## కొండగట్టు ఆంజనేయస్వామి దేవాలయానికి పోటెత్తిన భక్తులు

కొండగట్టు, మే 28: కొండగట్టులో కొలువైన శ్రీ ఆంజనేయస్వామి దేవాలయానికి భక్తులు పోటెత్తారు. ఆంజనేయస్వామికి ప్రీతికరమైన రోజు మంగళవారం. అలాగే వేసవి సెలవు రావడంతోపాటు హనుమాన్ జయంతికి ముందే స్వామి వారి భక్తులు దీక్షలు విరమిస్తున్నారు. దీంతో కొండగట్టు ఆలయం భక్తుల రద్దీతో కిక్కిరిసిపోయింది. ఆ క్రమంలో భక్తులతో క్యూ కాంప్లెక్స్‌లు నిండిపోయాయి. భక్తుల జై శ్రీరామ నినాదాలతో కొండగట్టు ప్రాంతం మార్మోగుతుంది. ఇక భక్తుల రద్దీతో కొండగట్టులో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. మరోవైపు భక్తుల రద్దీ దృష్ట్యా బుధవారం నుంచి ఆర్జిత సేవలు రద్దు చేస్తున్నట్లు దేవాలయం అధికారులు వెల్లడించారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టారు.



ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్
9440977660, 9110718194




## ఫోన్ ట్యాపింగ్ కేసు.. భుజంగరావు వాంగ్మూలంలో సంచలన విషయాలు

హైదరాబాద్: ఫోన్ ట్యాపింగ్ కేసుల్లో ఇంటెలిజెన్స్ అదనపు ఎస్పీ భుజంగరావు వాంగ్మూలంలో మరిన్ని సంచలన విషయాలు బయటకు వచ్చాయి. దర్యాప్తు బృందానికి భుజంగరావు కీలక విషయాలు వెల్లడించారు. "భారాసకు వ్యతిరేకంగా పనిచేసే వారి ఫోన్లు ట్యాప్ చేశాం. మాజీ డీఎస్పీ ప్రణీత్‌రావు సహకారంతో ట్యాపింగ్ చేశాం. భాజపా, కాంగ్రెస్‌లకు ఆర్థికంగా సాయపడే వారి ఫోన్లు ట్యాప్ చేశాం. భారాసలో వ్యతిరేక స్వరం వినిపించే నేతల ఫోన్లు ట్యాప్ చేశాం. ఎస్‌ఓటీ, టాస్క్‌ఫోర్స్ సహకారంతో ఫోన్ ట్యాపింగ్ చేశాం. విపక్ష నేతలు, విద్యార్థి నేతలు, జర్నలిస్టుల ఫోన్లు ట్యాప్ చేశాం" అని భుజంగరావు చెప్పినట్లు సమాచారం.

## ఫోన్ ట్యాపింగ్‌పై వాళ్లిద్దరూ సీబీఐ విచారణ కోరరా?: సీఎం రేవంత్‌రెడ్డి



హైదరాబాద్: అన్నింటికీ సీబీఐ దర్యాప్తు కావాలనే భారాస నేతలు కేటీఆర్, హరీశ్‌రావు.. ఫోన్ ట్యాపింగ్‌పై మాత్రం సీబీఐ విచారణ కోరరా? అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం మధ్యాహ్నం ఆయన దిల్లీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. "అధికారం మారాక జరిగిన బదిలీల్లో కొన్ని వస్తువులు మాయం అయ్యాయి. ఎవరు బాధ్యులో తేల్చే క్రమంలో ట్యాపింగ్ అంశం బయటకు వచ్చింది. హార్డ్‌డిస్క్‌లు, డేటా బ్యాకప్ ఎక్కుడుందో అధికారులే తేల్చాలి. డేటా ఉందో, లేదో.. ఎలా మాయం చేశారో అంతా విచారణలో తేలుతుంది. మా ప్రభుత్వం ఫోన్ ట్యాపింగ్ చేయదు. రాష్ట్రంలో రాచరిక వ్యవస్థకు తావులేదు. తెలంగాణ అంటే త్యాగాలు, పోరాటాలు. అవి గుర్తుకు వచ్చేలా రాష్ట్ర చిహ్నం ఉంటుంది. రాష్ట్ర గీతం రూపకల్పన బాధ్యతలు అందెశ్రీకి అప్పగించాం.

**ఎన్నికల కోడ్ ముగిశాక వాటి గురించి వివరిస్తా :** కాళేశ్వరం ప్రాజెక్టు సమస్యలపై నిపుణుల సలహాతో ముందుకెళ్తాం. ప్రస్తుతం అక్కడ నీటిని నిల్వ చేసి విడుదల చేసే పరిస్థితి లేదు. 52 టీఎంసీల నీళ్లు సముద్రంపాలయ్యాయి. వాటి విద్యుత్ బిల్లులన్నీ ప్రభుత్వం చెల్లించాల్సి వచ్చింది. ఎన్నడూ లేనంతగా రాష్ట్రంలో విద్యుత్ వినియోగం పెరిగింది. దానికి అనుగుణంగా ఏర్పాట్లు చేశాం. రాష్ట్రంలో కరెంట్ కోతలు లేవు. ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత విద్యుత్‌కు సంబంధించిన అన్ని విషయాలు వివరిస్తా"అని సీఎం రేవంత్ తెలిపారు.



## దిల్లీ మద్యం వ్యాపారం గురించి కేసీఆర్‌కు ముందే తెలుసు: ఈడీ

దిల్లీ: దిల్లీ మద్యం విధానం కేసులో మరిన్ని సంచలన విషయాలను ఈడీ బయటపెట్టింది. దిల్లీ హైకోర్టులో కవిత బెయిల్ పిటిషన్లపై వాదనల సందర్భంగా ఈడీ కీలక విషయాలు కోర్టు దృష్టికి తెచ్చింది. దిల్లీ మద్యం విధానం, రిటైల్ స్కామ్ గురించి ముందుగానే కవిత.. కేసీఆర్‌కు చెప్పారని పేర్కొంది. దిల్లీలోని కేసీఆర్ అధికారిక నివాసంలోనే తన టీమ్ సభ్యులైన బుచ్చిబాబు, అభిషేక్, అరుణ్ పిళ్లైను కవిత.. కేసీఆర్‌కు పరిచయం చేశారని ఈడీ తెలిపింది. ఆమె పరిచయం చేసిన వారి నుంచి కేసీఆర్ వివరాలు తెలుసుకున్నారని, కేసీఆర్‌కు సమీర్ మహేంద్రును బుచ్చిబాబు పరిచయం చేశారని వెల్లడించింది. "కేసీఆర్‌తో భేటీ వివరాలను గోపీ కుమరన్ వాంగ్మూలంలో రికార్డు చేశారు.

కవిత రెండేళ్లలో సుమారు 11 మొబైల్ ఫోన్లు వాడారు.. అందులో నాలుగు ఫోన్లలోఉన్న ఆధారాలను ధ్వంసం చేశారు. ఆమెకు బెయిల్ ఇస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు" అని ఈడీ తెలిపింది. కవిత బెయిల్ పిటిషన్లపై దిల్లీ హైకోర్టులో వాదనలు ముగిశాయి. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ స్వర్ణకాంత శర్మ తీర్పును రిజర్వు చేశారు.

## రైతులపై దాడులు జరుగుతుంటే సీఎం ఢిల్లీ పర్యటనలో ఉండటం సిగ్గుచేటు

ఆదిలాబాద్‌లో రైతన్నలపైన లాఠీచార్జిని భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. రైతులపైన దాడి చేసిన ప్రభుత్వం వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతన్నల పైన దాడులు జరుగుతుంటే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇతర రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం, ఢిల్లీ పర్యటనలో బిజీగా ఉండడం సిగ్గుచేటన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి రైతన్నల సమస్యలను పట్టించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఐదు నెలల్లోనే రాష్ట్రం వ్యవసాయం సంక్షోభంలో కూరుకుపోవడం ముమ్మాటికి ప్రభుత్వ పరిపాలన వైఫల్యమేనని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో రైతుల సమస్యలపై సీఎం వెంటనే ఉన్నత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించాలన్నారు. రైతన్నల పైన లాఠీచార్జ్ చేసిన అధికారులపై కేసులు నమోదు చేసి, చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.





## ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు

హైదరాబాద్: నగరంలోని ప్రజాభవన్‌కు బాంబు బెదిరింపు వచ్చింది. అక్కడ బాంబు ఉన్నట్లు పోలీసు కంట్రోల్ రూమ్‌కు ఓ వ్యక్తి ఫోన్ చేశాడు.

వెంటనే ప్రజాభవన్ వద్దకు బాంబు స్క్వాడ్ సిబ్బంది చేరుకుని క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. చివరికి ఇది ఆకతాయిలు చేసిన పనిగా పోలీసులు నిర్ధరించారు.

## మానుకోట ఘటనకు నేటికి 14 ఏండ్లు.. ఎమ్మెల్యే హరీశ్‌రావు ట్వీట్

హైదరాబాద్ : మలిదశ తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న వేళ.. మానుకోట ఘటన ఓ చారిత్రాత్మక సందర్భం.. తెలంగాణ ఉద్యమ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన ఆ సంఘటన జరిగి నేటికి 14ఏండ్లు అవుతుందని గుర్తు చేస్తూ మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ట్వీట్ చేశారు. ఆధిపత్య అహంకారంతో తుపాకులు ఎక్కుపెట్టిన అప్పటి పాలకులకు మానుకోట రాళ్లే సమాధానం చెప్పాయి. తుపాకీ తూటాలకు ధీటుగా తిరగబడ్డాయి. పోలీసుల బుల్లెట్లకు ప్రతిస్పందిస్తూ ఉద్యమకారులు చూపిన తెగువకు సమైక్య పాలకులు వెనుదిరుగక తప్పలేదు. తెలంగాణ ఉద్యమ ఉనికినే ప్రశ్నార్థకంగా మార్చే ప్రయత్నాన్ని మానుకోట మట్టి సాక్షిగా ఉద్యమకారులు ఏకమై తిప్పి కొట్టారు. స్వరాష్ట్ర ఆకాంక్షను మరోసారి బలంగా చాటిచెప్పారు. ఈ క్రమంలో తుపాకీ తూటాలకు వెరవలేదు, లాఠీలకు భయపడలేదు. స్వరాష్ట్ర ఏర్పాటు లక్ష్యంగా ముందుకు కదిలి ఉద్యమానికి ఊపిరిలూదారు. ఆ చారిత్రక సన్నివేశాలు ఇంకా నా కళ్ళ ముందు కదలాడుతూనే ఉన్నాయి. చరిత్రపుటల్లోనూ అవి చిరస్థాయిగా నిలిచిపోతాయి. భవిష్యత్ తరాలకు తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిని చాటుతాయి అని హరీశ్‌రావు పేర్కొన్నారు.



PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660